పెద్దపల్లి కమాన్ : శమీ పూజలో హారతిఇస్తున్న మహిళలు

ఓదెల : మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కమిటీ చైర్మన్, సభ్యులు

జూలపల్లి : శమీ పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

ఘనంగా విజయదశమి వేడుకలు

పెద్దపల్లి కమాన్ : శమీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, నాయకులు

పెద్దపల్లి కమాన్/పెద్దపల్లి టౌన్/పెద్దపల్లి రూరల్/కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి/సుల్తానాబాద్‌రూరల్/ఓదెల/ధర్మారం/ అక్టోబర్ 24 : విజయదశమి వేడుకలను పెద్దపల్లి నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం వేకువజామున నుంచే ఆలయాల్లో పూజలు చేశారు. పలువురు ఆయుధ పూజ, వాహన పూజలు చేయించుకున్నారు. సాయంత్రం వేళలో శమీ పూజ చేసి, జమ్మి ఆకులు ఒకరికొకరు పంచుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన శమీ పూజ లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి–ప్రశాంత్‌రెడ్డి దంపతులు, పలువురు కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శాంతినగర్ శ్రీషిర్డిసాయి బాబా ఆలయంలో బాబా సమాధి పూజా కార్యక్రమాన్ని జరిపారు. పలు ప్రాంతాల్లో రావణ బొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో శమీ పూజలు చేశారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఓదెల మల్లికార్జు నస్వామి ఆలయంలో వేదపండితులు దూపం వీర భద్ర య్య, భవానీ ప్రసాద్ శమీ పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, యాదవ సంఘ నాయకులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాల్వశ్రీరాంపూర్ లో జరిగిన దసరా వేడుకల్లో తోపులాట జరిగింది. పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

మల్లన్న ఆలయంలో డైరెక్టర్ సంపత్ నంది పూజలు

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రముఖ సినీ దర్శకుడు సంపత్ నంది కుటుంబ సమేతంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలో తన వాహనానికి వేదపండితులతో పూజలు చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తమ వాహనాలకు పూజలు చేయించారు.

ధర్మారం : శమీ పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

సుల్తానాబాద్ రూరల్ : శమీ పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

ఎమ్మెల్యే దాసరికి శుభాకాంక్షల వెల్లువ

పెద్దపల్లి, అక్టోబర్24: దసరా సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి సర్దార్ రవీందర్ సింగ్ ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. రవీందర్‌సింగ్‌ను పలువురు బీఆర్ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతక ముందు రోజుల పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అభిమానులు, శ్రేయోభిలాషులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

ఓదెల, అక్టోబర్ 24: పెద్దపల్లికి వచ్చినబీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సర్దార్ రవీందర్ సింగ్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. సీఎం కేసీఆర్ అప్పజెప్పిన బాధ్యతలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు సాత్తూరి రవి, కొంకటి లింగమూర్తి, అడ్వకేట్ గాండ్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు, పక్కన సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

పెద్దపల్లి : దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

దుర్గామాతకు ఎమ్మెల్యే దాసరి పూజలు

పెద్దపల్లి, అక్టోబర్24: పెద్దపల్లి జెండా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అర్చకుడు శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పూజలు చేశారు. అనంతరం దుర్గామాత నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కోలాటాలు, నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య దుర్గామాత శోభాయాత్ర కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యాక్షుడు ఉప్పు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 24: ప్రయువతీ యువకులు సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్తారం పంచాయతీ పరిధి ధర్మాబాద్‌లో మాజీ ఉపసర్పంచ్ కీర్తి రాయగట్టు తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తి రాయగట్టు–మణెమ్మ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీపీ బండారి స్రవంతీశ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ ఎద్దుమారస్వామి, ఉపసర్పంచ్ చెలుకల సంపత్, మాజీ సర్పంచ్ నల్ల రజిత మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

శోభాయాత్రలో కోలాటమాడుతున్న యువతులు, మహిళలు

ధర్మారం,అక్టోబర్24:ధర్మారం మండలంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15న మండలంలోని ఖిలావనపర్తి,దొంగతుర్తి,మల్లాపూర్,బొట్లవనపర్తి,నర్సింహులపల్లి, కొత్తూరు, ఎర్రగుంటపల్లి,నర్సింగాపూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లోని దుర్గామాత విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో శోభాయాత్రగా తరలించారు. డీజే బాక్సుల్లో అమ్మవారి పాటలకు అనుగుణంగా మహిళలు, యువకులు దాండియా ఆడుతూ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర అనంతరం దుర్గాదేవి విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు.

27న కంటి వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్24: పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల27న కూనారంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్యదర్శి వేల్పుల రమేశ్ తెలిపారు. రేకుర్తి కంటి దవాఖాన సౌజన్యంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.